చిత్ర సమీక్ష

బిగువుగా, రసవత్తరంగా నడచిన సురేష్‌వారి

శ్రీ కృష్ణ తులాభారం

సురేష్ ప్రొడక్షన్సువారు దాదాపు పదిలక్షల వ్యయంతో నిర్మించిన శ్రీకృష్ణ తులాభారం విడుదలైంది. శ్రీ రామానాయుడు నిర్మాతగా 'రాముడు-భీముడు' చిత్రంతో బాగా నిలద్రొక్కుకున్నతర్వాత మరలా శ్రీ ఎన్. టి. రామారావు, శ్రీమతి జమునలతో భారీచిత్రం తీయాలని సంకల్పించి, ఇప్పటికి పూర్తిచేశారు. మధ్యకాలంలో సురేష్ పిక్చర్సు పేర ఒకసన్నకారు చిత్రాన్ని విడుదలచేసిన సంగతి తెలిసిందే. రామారావుతో, జమునతో, సెట్టింగులతో చిత్రం తీయడం భారీరొత్తు. మొదట శ్రీ చాణక్య దర్శకత్వం వహిస్తారని తెలిసిన ఈ చిత్రం క్రమేణా శ్రీ కమలాకర కామేశ్వరరావు చేతుల్లోకి మారింది. ఇలాంటి పౌరాణికాలకు శ్రీ కామేశ్వరరావు అందెవేసిన చేయి, అద్వితీయ ప్రతిభాశాలి.

శార్వరి

తెలుగువారికి శ్రీకృష్ణ తులాభారం కథ చెప్పడం, అమ్మ పుట్టిల్లు మేనమామదగ్గర పొగిడినట్లవుతుంది. తెనాలి సుంది శ్రీ స్థానం నరసింహారావు సత్యభామ వేషం కట్టి 'శ్రీకృష్ణ తులాభారం' నాటకం ఆడడం, ఇంకా తెలుగునాటక ప్రియులు మరచిపోలేదు. క్రమంగా బహుళ ప్రచారం పొందిన నాటకాలన్నీ సినిమాలుగా అవతరించాయి కనుక శ్రీ రామానాయుడు ఈ నాటకం, సినిమాగా ఆడించారు.

ఎన్. టి. రామారావు కృష్ణ పాత్ర కోసం జన్మించినవాడేనన్నట్లు నటించి నటనలో జీవిస్తాడు కనుక భయంలేదు. సత్యభామ లక్షణాలు తెలుగుతారల్లో వున్నది భానుమతికి లేదా జమునకు. ఇద్దరిలో చిన్నారి పొన్నారి జమున కనుక, సురేష్ వారికి జమున-రామారావుల చిత్రం ధనయోగం కనుక, ఆమెనే తీసుకున్నారు. పోతే రుక్మిణిగా అంజలీదేవి బాగానేవుంది. జాంబవతిగాకృష్ణకుమారిమరీఎక్‌స్ట్రావేషాలకు దిగజారినట్లు కనిపించింది. అంతగా నాల్గవశ్రేణి వేషాలకు ఆవిడ కక్కుర్తిపడ్డా నిర్మాతలు మరీ అంత చిన్నవేషం వేయించి అవమానించడం బాగాలేదు. ఇంద్రుడుగా రాజనాల, ఆయన దేవేరిగా యస్. వరలక్ష్మి; కృష్ణుని చెలికాడు వసంతుడుగా పద్మనాభం; రుక్మిణి చెలికత్తె, సత్యభామ చెలిగా, పద్మనాభం ప్రియురాండ్రుగా మీనాకుమారి వాణిశ్రీలు ఖరాబుచేశారు. సినిమాలో నాటకంలో ప్రజాదరం పొందిన పద్యాలు, పాటలు పుష్కలంగా వున్నాయి. జనాన్ని ఆకర్షించేవి పద్యాలు, పాటలు, కృష్ణ సత్యభామల నటన. కాంతారావు నారదుని పాత్రలో, ఎన్నడూ, ఏ యితర భూమికలలోనూ లేని, పొందని అందాన్ని, చందాన్ని పొందాడు. వెనుకటి రామకృష్ణశాస్త్రి జ్ఞాపకం వచ్చారు. కథను ఎన్ని మలుపులు త్రిప్పినా, ఒక్క సంఘటనను చక్కగా ఎస్టాబ్లిష్‌చేయడం దర్శకుని ప్రతిభకు నిదర్శనం.

చౌకబారుశృంగారంచూచి ప్రేక్షకులు పరవశించిపోతారనే భ్రమ నిర్మాతలకు వదలకుండావుంది. మీనాకుమారి, వాణిశ్రీ, పద్మనాభంమధ్య అల్లిన ప్రేమ చచ్చుగా, పుచ్చుగా వుండడమేకాక, లోగడ కొన్ని పందలచిత్రాల్లో చూచినట్లు అసంభవంగానూవుంది. వాణిశ్రీ మోహం చూడడానికే జుగుప్సాకరంగావుంది. మీనాకుమారి, వాణిశ్రీలపై సెక్స్ ఎక్స్‌ప్లాయిటేషన్ మహాఘోరం.

కృష్ణునిచెలికాడు వసంతుడు అంటే, ఎంతో విద్యావంతుడు, మంత్రి, హాస్యచతురుడు అనేగాని, ఉత్త పోరంబోకు కామెడియన్‌కాడు. జుగుప్సాకరమైన శృంగారంకోసం ఆ పాత్రలను ప్రవేశపెట్టినట్లేవుంది. ఈ శృంగారహత్యను తీసివేస్తే, చిత్రం కొన్నివేలఅడుగుల నిడివి తగ్గి, యింకా బిగువువచ్చేది.

కృష్ణుని ధారాదత్తంచేశాక నారదుడు ఆయనకు తనదగ్గరవున్న దండ, కమండలాలు, వ్యాఘ్రాజినంయిస్తాడు మోసుకు రమ్మని. నారదునికున్నసొత్తు మహతి ఒక్కటే. మామూలుగనన్నానుల్లా దండ కమండలాలు, అజినం నారదునికి ఎక్కడా కనిపించవు. కాని ఈఘట్టంలో అమాంతం వాటినిసృష్టించి కృష్ణుని చేతుల్లో పెడతాడు.

మొత్తంమీద చిత్రం బిగువుగా, రసవత్తరంగా నడిచింది. మొదటనే శ్రీకృష్ణుని దక్షిణనాయకత్వం చూపించారు. ఎనిమిదిమంది భార్యలతో ఒకేసమయంలో శృంగారం నెరపుతూండడం నారదుడు కనులారాచూచాడు. అంటే కృష్ణుడు ఒకేసమయంలో ఇటు సత్యభామవద్ద, రుక్మిణివద్ద, మిగిలిన పత్నులవద్ద వుండగలడు. ఆ లెక్కకొస్తే పదహారువేలమంది గోపికాజనాన్ని ఒకేసారి రసకేళిలో తేలించగలడు. అయితే అదేకృష్ణుడు తమఇండ్లకు రావడంలేదనీ, తమమోహాలు చూడడంలేదనీ, సత్యభామాలోలుడైనాడని జాంబవతి పలుమార్లు వ్యక్తంచేస్తుంది. అతని దక్షిణనాయకత్వం కథకోసం ఇక్కడ చెలామణికాలేదేమో! అలాంటప్పుడు మొదట అ అష్టపత్ని శృంగారంచూపడం అనవసరం. బహుశా అది బాక్సాఫీసు సూత్రంకావచ్చు!

మొత్తంమీద చిత్రం పౌరాణికం గనుక అందులోనే చాలాజాగ్రత్తగా దర్శకుడు వ్యవహరించారు గనుక లోపరహితంగా, రసవత్తరంగా కనిపిస్తుంది. పాటలు బావున్నాయి. పద్యాలు తప్పనిసరిఅయినాయి. కె. ఎస్. రెడ్డి నృత్యదర్శకత్వం నెరపే ప్రతిచిత్రంలో ఏదోఒకవిధంగా తన మోహము కనిపించాలనే తాపత్రయం అవుపిస్తుంది. నరకాసుర సంహారానంతరం కృష్ణ-సత్యభామలకు స్వాగతంలో ఈ రెడ్డి నృత్యం, విరుపులు ఎందుకో అర్థంకాదు.

నృత్యాలంటేజ్ఞాపకంవచ్చింది. రంభగా ఎల్. విజయలక్ష్మి మల్లెసరాలగ్రెస్‌లో, ఆ మొగ్గలబారులతప్ప వేరే దుస్తులే లేవన్న భ్రమలోచేసిననృత్యం చౌకబారుగావుంది. నిజంగా రంభ అనే అప్సరభామిని ఇంత వెకిలిగా నాట్యంచేయగలదా అనిపిస్తుంది. అవకాశమేవుంటే రంభ, ఇంద్రుడువచ్చి ఈ నకిలీరంభపై పరువునష్టందావా వేయవచ్చు.

ఇంత తెలిసిన నముద్రాల రాఘవాచార్య గారు వసంతకునిపాత్రకు అన్యాయం చేశారు. మామూలు సినిమా కమెడియన్‌గా దిద్దారేగాని, అతన్ని కృష్ణుని చెలికానిగా

—కొరవ 7 వ పేజీలో



జగపతి పిక్చర్సువారి 'ఆస్తిపరులు' చిత్రంలో చిలిపి అందాల యవ్వనవుతార జయలలిత.

ప్రశ్నోత్తరాలు

సి. మహమ్మదాలిముంగమూరు

ప్ర: 'దేవదాసు' చిత్రంలో నాగేశ్వరరావు త్రాగుడువేషం బావుందా? 'నవరాత్రి'లో త్రాగుడువేషం బావుందా?

జ: అప్పుడు నటించినట్లుంది, ఇప్పుడు సహజంగావుంది.

దామోదరం సూళ్లూరుపేట

ప్ర: మన సినీదర్శకులు నీతి - నిజాయితీ లేని అసభ్యకరమైన చిత్రాలు తీస్తున్నారు. కారణం?

జ: చూస్తున్న మనమే. అమధ్య ఢిల్లీలో వస్తువులధరలు పెంచారని గృహిణులు కొనడం మానివేశారని, దానితో వస్తువులధరలు తగ్గాయి. చూచేవాళ్ళ బలహీనతలను రెచ్చగొట్టడంలో నీతి-నిజాయితీ ప్రసక్తిలేదు.

షణ్ముఖాచారి తిరుపతి

ప్ర: 'చిలకా - గోరింకా'లో కృష్ణకుమారి కృష్ణంరాజును తన క్లాస్‌మేటుగా పరిచయంచేస్తుంది. ఆమె భీమావిజంటు గదా!

జ: అతను మరీ కొత్తవాడుకాదని చెప్పడమే ఆమె లక్ష్యం. చదువుకునే రోజుల్లో క్లాస్‌మేట్ అంటే అర్థంతరమా!

బి. ప్రభాకరరావు వెంకటగిరి

ప్ర: తెలుగువారు పౌరాణికాలు నిర్మించినట్లు మరియెవరూ నిర్మించరా?

జ: ఏం, హిందీలో తక్కువవున్నాయా? జానపదాలలోమాత్రం మనదే పైచేయి

కొండరాజు రామచంద్రపురం.

ప్ర: నేను ఎన్ని ఉత్తరములు వ్రాసినను జవాబు వ్రాయుటలేదు. కారణము తెలియచేస్తారా? గీతాంజలి, పద్మనాభం కలిసి ఎక్కువ సినిమాల్లో నటించుటకు కారణం?

జ: మీ ప్రశ్నలు చచ్చుగా వుండడం. ఒక ప్రశ్నకు సమాధానం యివ్వడంఅంటే అది పదుగురకు ఆసక్తికరంగా వుండాలి. గీతాంజలి - పద్మనాభం అలాంటి జంటలు అలవాటేగా! శివరావు, కనకం; రేలంగి, గిరిజ; బాలకృష్ణ, మీనాకుమారి ఎందరులేరు?

టి. వి. శేషయ్య నెల్లూరు.

ప్ర: గూఢచారి 116 లో రాజనాలను ముక్కామల 5 సార్లు కాల్చినా చావడు. హీరో మిద్దెపైనుండి పిస్టల్ చూపగానే భయపడుతాడు ఎందుచేత?

జ: అది నిజం పిస్టల్ అనే అనుమానం వచ్చివుంటుంది.

జి. రమణయ్య నెల్లూరు.

ప్ర: 'సర్వర్ సుందరం'లో షూటింగు చూపించారుగదా. నిజం సినిమాలను కూడా అలా తీస్తారాండీ?

జ: అంతకంటే ఘోరంగా తీస్తారు. టైం వేస్టుకాకుండా క్లుప్తంగా చూపించారు. నిజం షూటింగ్ అయితే, రెండు వాక్యాల సంభాషణ షాట్ చేయడానికి గంట అయినావడుతుంది.

నాగేశ్వరరావు కె. వి. పల్లి.

ప్ర: పౌరాణికాల్లో లవకుశ, జానపదాల్లో తెనాలి రామకృష్ణ, సాంఘికాల్లో మూగమనసులు ఆడినన్ని రోజులు యింకే చిత్రాలైనా ఆడాయా?

జ: ఒకటి మూడు కరెక్టు కానీ, తెనాలి రామకృష్ణ జానపదంకాదే; చారిత్రకం. జానపదాల్లో పాతాళభైరవి, సువర్ణసుందరి బాగా ఆడిన చిత్రాలనుకుంటాను.

— —

'గొల్లభామ' మరో వెర్షన్

శేఖర్ ఫిలిమ్స్ అనేసంస్థ 'గొల్లభామ' చిత్రాన్ని హైదరాబాదు సారధీ స్టూడియోలో నిర్మిస్తున్నది. ముఖ్యభూమికలు దేవిక, ఎన్. టి. రామారావు పోషిస్తున్నారు. ముక్కామల, రేలంగి, విజయానిర్మల, శైలశ్రీ, గిరిజ, ఎస్. వరలక్ష్మి కూడా పాత్రధారులే. శ్రీ పి. పుల్లయ్య దర్శకుడు. ఇటీవలనే రాకుమారుడు చంద్రశయన మందిరంలో దేవిక, రామారావులపై ఒక యుగళగీతం చిత్రీకరించారు.

— —

లోకవృత్తం

(3 వ పేజీ కొరవ)

ఆరంభం కావచ్చును. పరిస్థితులు అనుకూలిస్తే, ప్రత్యక్షమవుతుంది. బంగాళమంతా కలిసివస్తే, అంతకంటే కావలసిందేమున్నది?

అదీ చైనాప్లాను! ఇది అవుతుందా అంటే అది వేరేవిషయం. మనం దానిని కానివ్వం. మనబొందెల్లో ప్రాణాలుండగా అది అసంభవం.

కాని చైనామాత్రం పాకిస్తాన్‌పోసిన గంజిత్రాగుతూ 'నీవాకందుకుపోస్తే నేనొకందుకు త్రాగుతున్నా' అని లోపల అనుకుంటున్నది.

• • •

చైనాచర్య ఇండోనీషియా విషయమై శ్రుతిమించి రాగానపడింది. ఇండోనీషియా ప్రతినిధి పీకింగ్‌లో పిల్చినవిందుకువచ్చిన చైనారాజ్యప్రతినిధులు 'వాకౌట్' చేశారు. ఇండోనీషియా అవలంబించే రాజనీతిని ఈ విధంగాకూడా చైనా ఆక్షేపించిందన్నమాట.

ఇండోనీషియాలో చైనావారిని అవమానించినందుకు నిరసనతెల్పుతూ చైనా 60 పత్రాలను పంపింది. అవి బుట్టదాఖలైనవట. ఆ కోపంతో ఈ పైనిచెప్పిన 'వాకౌట్'!

సుకర్ణాయ ప్రగల్భానికి ఇండోనీషియా విద్యార్థులు మేమన్నంతపని చేశారు. మళ్ళీ ఇండోనీషియా కమ్యూనిస్ట్ పార్టీని పాతాళంనుంచి లేవదీయడానికీ, చైనాపద్ధతికి ప్రోత్సాహమివ్వడానికి సుకర్ణాయ ప్రగల్భిస్తున్నాడు గనక, అతడికట్టి అధికారం లేదని చెప్పవలసిందని విద్యార్థి సమితి కోరింది.

ఇక ఆ సమితి చైనామీదనే విరుచుకపడుతుంది. ఇండోనీషియాలో చైనాకిక యింతలో నిల్వనీడ దొరకదు. అక్కడ వుండే చైనావారికి బ్రతుకు కష్టతరమవుతుంది.

స్వయంకృతాపరాధాలకు చైనా పెట్టింది పేరు.

• • •

మళ్ళీ మనం కాసేపురష్యాకుపోదాం. మనకూ రష్యాకూ యిదేమి యెడతెగని బంధమో? ఇదేమి పురాకృతకర్మఫలమో? మన పూర్వీకులైన ఆర్యులున్నారే, సెంట్రల్ ఏషియానుంచి వచ్చినారు, ఆ మానవ సమాజం బాపతువారే కాబోలు రష్యనుల పూర్వీకులుకూడా! ఆపురాణం పోనీయండి ప్రస్తుతం చర్చనీయాంశానికివస్తాం. ఎవరో కోసిగిన్ ప్రభుత్వాన్ని అడిగినారట: 'స్టాలిన్ చర్యలను ఖండించి, స్టాలిన్ బాధించిన స్వర్గీయులను స్మరించి ఆదరించారుగదా. కీ. శే. ట్రాట్‌స్కీని అదిధంగానే మళ్ళీ ఆదరిస్తారా?' అందుకు సమాధానం తడుపుకోకుండా వచ్చింది: 'స్మరంతి. స్టాలిన్ పద్ధతిని ఖండిస్తే, ట్రాట్‌స్కీ విధానాన్ని అంగీకరించినట్లు గాదు. అట్లా ఎన్నటికీ జరగదు.'

ట్రాట్‌స్కీ చేసిన అపరాధమేమంటారా? ఒకటిగాదు అనేకం వున్నవి. వినండి. నేరం నెంబర్‌వన్. 'లెనిన్ సహచరి. ఆయనకు విశ్వాసపాత్రుడు. ఆయన ఆదరణను పొందినవాడు. మహా ప్రతిభాశాలి. అనేక భాషలయందు ప్రావీణ్యం గలవాడు. జనాన్ని ఊపివేయగలడు. కార్యకర్తలను రంగంలోకి దూకించగలడు. రాజనీతిలో నిష్ణాత.'

రెండవ నేరం: 'విప్లవం అనన్నంకాగా, బోల్షివిక్‌పార్టీ సెంట్రల్ కమిటీలో ట్రాట్‌స్కీయే ప్రప్రథమంగా ఆ సంగతిని గుర్తించి లెనిన్‌అండన నిల్చెను. పిమ్మట అంతా విప్లవ జయ కారాలు చేశారు.'

మూడవనేరం: 'మిలిటరీ రెవల్యూషనరీ కమిటీ ప్రెసిడెంట్‌గా వుండి, 23 రంగాలలో విప్లవ రష్యారాజ్యాన్ని ముట్టడిచేసిన బూర్జువా ప్రభుత్వాల దుష్టశక్తులను చెల్లాచెదరు చేసినవాడు ట్రాట్‌స్కీ.'

నాల్గవ నేరం: 'మూడు పెద్ద పుస్తకాలలో రష్యా విప్లవ చరిత్రను కండ్లకు కట్టినట్లు చిత్రించినవాడు ట్రాట్‌స్కీ. మామూలు వీధి ప్రదర్శనంవద్దనుంచి విప్లవం వచ్చేవరకు విప్లవకారులు ఉద్యమాన్ని ఎట్లా నడిపిస్తారో, నడిపించవలెనో సూచించాడు. విప్లవమనే సైన్సును విశదీకరించాడు. ఈ గ్రంథాలిప్పుడు రష్యాలో దొరకవు. మన మద్రాస్ విశ్వవిద్యాలయ గ్రంథాలయంలో, విజయవాడ గాంధిపార్కు లైబ్రరీలో వున్నవి. ఉత్సాహంగల చదువరులకు లభ్యం కాగలవు.'

అయిదవనేరం:'My Life నా జీవితం అనే గ్రంథాన్నీ Stalin అనే గ్రంథాన్నీ వ్రాశాడు. ఇవి రెండూ ఆయనకు స్టాలినుకూ వచ్చిన పేచీలను విశదీకరిస్తవి.'

ఆరవ నేరం: 'మెక్సికోలో ఆశ్రయం పొంది, జీవితాంతం వరకు విప్లవ వ్యాప్తికి పాటుపడినాడు. విప్లవ జ్వాలలతో విశ్వమే నిండాలె' అని బోధించెను.'

ఏడవనేరం: 'స్టాలిన్ దిగజారిపోయిన కమ్యూనిస్టని ట్రాట్‌స్కీ పల్కెను. స్టాలిన్ నైజాన్ని లోకానికి చూపిన ప్రథమ పురుషుడు ఈయన.'

ట్రాట్‌స్కీ జీవిత చరిత్రను Issac Deutcherఐజాక్ డ్యూచర్ మూడు భాగాలలో హృదయంగమంగా వ్రాసిపెట్టినాడు. ఐవేండ్ల క్రిందట ప్రచురణ జరిగింది. మొదటి భాగం: Prophet Armed సాయుధుడైన ప్రవక్త. రెండవ భాగం: Prophet Unarmed నిరాయుధుడైన ప్రవక్త. మూడవ భాగం: Prophet Outcast వెలివేయబడిన ప్రవక్త.

ఈ జీవితచరిత్ర మహోత్కృష్టమైనది. Franz Mehring ఫ్రాంజ్‌మేరింగ్ రచించిన life of Karl Marx కార్ల మార్క్సు జీవితచరిత్రకిది సాటియని చెప్పవచ్చును.

• • •

ఈ పంక్తులు వ్రాస్తూవుండగా ఈ వృత్తాంతం వచ్చింది. థాయ్‌లాండ్, ఫిలిపైన్స్, మలేషియాలు కలిసి వియత్నాం సమస్యాపరిష్కారికొరకు శాంతి యత్నం చేయదలచినవి; ఆ యత్నాన్ని జపాన్ హర్షించింది; అది నిష్ప్రయోజనమని మన ప్రధాని అన్నదట; ఇంతకంటె అవివేకం వుండబోదు. ప్రపంచంలో స్నేహితులను పోగొట్టుకునే విద్య సాంప్రదాయకంగా మన ప్రభుత్వాల కబ్బుతున్నదని దీనివల్ల మనం తెలుసుకుంటున్నాం. పార్లమెంటులో ప్రధాని యిందువిషయమై ప్రశ్నల వర్షానికి గురికాకతప్పదు.

అట్టిదే ఇంకొక వృత్తాంతం: సుకర్ణాయకనుకూలంగా, వ్యతిరేకంగా కొన్నిచోట్ల రచ్చలు జరిగినవి. కమ్యూనిస్టులు మళ్ళీ తలయెత్తినారు. విద్యార్థిసమితి ఈసారి పూర్తిగా కమ్యూనిస్టులతో తేల్చివేసుకుంటుంది. — —

వారంవారం

(3 వ పేజీకొరవ)

భూకంపాలు ఎప్పుడువస్తాయో, చాల ముందుగా తెలుసుకొనలేక పోతున్నాము. అవి రాకుండాజేసే మార్గాలేవైనా వున్నాయా? అని అన్వేషణ చేయడంలేదు. ఇట్లా అంటే కొందరికి నవ్వు రావచ్చును. కాని, పరిశోధించే మహాత్ముల కలవిగాని విషయమున్నదా?

• • •

మన ప్రబుద్ధులు దేశాన్ని ఎట్లా బాగుచేయదలచుకున్నదీ ఇంకొక దృష్టాంతం వల్ల తెలుస్తున్నది!

ఒరిస్సా పూర్వరాజధాని నగరంలో ఎక్కువ జనసమ్మర్దంవుండే బజారులో ఒక విదేశీ మత్తుపానీయాలు బహిరంగంగా సేవించే ఒక విక్రయశాలకు లైసెన్సు నిచ్చినారు.

పరాయి టూరిస్టులకోసం కావలెనంటే నగరాలకు దూరంగావున్న విక్రయ శాలలను వుంచండి. అందులో 'బార్' వుంచండి.

తప్పతాగేవాడైనా, పూళ్ళో మధ్యలో తెచ్చి మద్యపానీయాలను తెచ్చిపెట్టమని అడగడే?

మనమిప్పుడు మద్యనిషేధం వర్జనీయం అని అనలేదు. అది సరిగా అమలు జరగనందున, కొన్ని నిబంధనలను సడలించి, తర్వాత బిగించి, మళ్ళీ మద్యంలేకుండా జేయవలెననే సంకల్పంలో వున్నాము. అదీ కాదనుకోండి. మనలో కొందరు శతగోపాదార్యులన్నట్లు మద్యనిషేధం చట్టరీత్యా తొలగించామనుకోండి. అప్పుడైనా యిటువంటి లైసెన్సు యిస్తారా?

అప్పుడింకా జాగ్రత్తగా వుండవలెను. ఆంగ్లసీమలో, కాస్త కైపు కన్పించినట్లుండి వీధిలో కన్పించనీయండి, వానిగతి ఏమవుతుందో చూడండి.

ఏదేశంకూడా త్రాగుడులో విచ్చలవిడిని అంగీకరించదు. మరి, గాంధిసీమలో, మన దొర్భాగ్యుల ప్రవర్తన ఇట్లా వున్నదే, ఇదేమి ఖర్మం?

కామరాజా? ఇందిరాగాంధీ, చల్లనితల్లీ! మీ పక్షంలో, మీ పరిపాలనలో ఎవడికీ కాడూ, బొంగరం లేదా?

ఏమిటీ అపహాస్యం?

• • •

భారతీయైక్యతకు చిహ్నం నాగాలాండ్‌లో లభ్యమవుతున్నది. ఇది మన సౌభాగ్యం.

ఆవోను దించి, అంగామీని అక్కడ ముఖ్యమంత్రిగా చేశారు. ఐతే అంగామీ ఏంచేశాడు? బస్తీమేసవాల్! నాదే రాజ్యం! అని విర్రవీగినాడా? లేదే?

ఏకగ్రీవంగా తానెట్లా తన పక్షంలో నాయకుడుగా ఎన్నికై, పిమ్మట ప్రధాని ఐనాడో, అంత ఏకగ్రీవంగానూ తన యింట్లో ఆవో దంపతులకు ఘనమైన వీడ్కోలు నిప్పించాడు. ఆవో ప్రజాసేవలో నిమగ్నమై హాయిగా కృషిజేసే నిమిత్తం నాగాజాతీయపక్షం (నాగాలాండ్ ప్రభుత్వాన్ని నడిపేపార్టీ) ఆయనకొక మోటార్ కారును బహూకరించారు. తాను సాదా జీవితం గడిపేవాడననీ, తనకింత ఖరీదుగల వాహనం అవసరంలేదనీ, ఐనా ప్రేమతో యిచ్చిన కాన్కను నిరాకరించననీ ఆవోపల్కెను.

భారతదేశంలో భిన్నత్వంలో ఏకత్వం వున్నట్లే, నాగా ప్రాంతంలో తెగలనేకమైనా భావం ఒకటేననీ, భారతభూమిలో నాగాప్రాంతం కలిసివుండే ప్రాంతమనీ, ఏకభారత ప్రభుత్వంలో భాగమే నాగా ప్రభుత్వమనీ అంగామి పల్కెను.

నాగా విద్రోహులు రాజీపడి చర్చలకు రాదలచితే, వారితోకలిసి నాగాప్రాంతపు అభివృద్ధికి సాయపడేటందుకు తాను సిద్ధమనికూడా నూత్న నాగా ముఖ్యమంత్రి నుడివెను.

ఉత్తరప్రదేశ్‌వారూ, ఆంధ్రప్రదేశ్‌వారూ, అన్నిప్రదేశాల కాంగ్రెస్ నాయకులారా, వినాయకులారా, వెళ్ళి అంగామీ-ఆవోలకు సాష్టాంగపడి, రెండు చెంపలు వేసుకుని, 'మీరుచూపిన త్రోవను బట్టి ఇక మీద నడిచెదము' అని ప్రమాణంచేసి రండి! మీరుబాగుపడుతారు, దేశమూ బాగుపడుతుంది!

• • •

అబ్దుల్లాతో జయప్రకాశ్ చర్చలు మళ్ళీ కాశ్మీర్‌లో అసందిగ్ధస్థితిని కల్పిస్తున్నదనీ, అదైనా కాశ్మీర్ ప్రభుత్వానికేమీ తెలియకుండా జరుగుతున్నదనీ, కాశ్మీర్ ముఖ్యమంత్రి సాదిక్ ప్రకటించెనని ఈ పంక్తులు వ్రాస్తూవుండగా తెలిసింది. కేంద్రానికీ, కాశ్మీరానికీ సంబంధం అది సన్నిహితంగా వుండవలెను.

— —

చిత్రసమీక్ష

(6 వ పేజీ కొరవ)

గౌరవించలేదు. చెలికత్తెలవేషాలువేసేవారు ఒకప్పుడు హీరోయిన్సుకన్నా అందంగా వుండేవారు. ఈనాడు వాణిశ్రీ, మీనాకుమారిలాంటివాళ్ళ చెలికత్తె వేషాలు చూస్తోంటే, అంతలావుద్వారకలో ఈ చెలికత్తెలమొహాలుచూస్తూ శ్రీకృష్ణుడు అసలెలా సంసారం చేయగలిగాడా, సన్యాసం పుచ్చుకోక అనిపించింది.

మొత్తంమీద చిత్రంవిలువ నిలబెట్టినవారు శ్రీ రామారావు, కాంతారావు, జమున, అంజలి. మిగిలినపాత్రధారులలో విశిష్టతలేదు. సెట్టింగులు బ్రహ్మాండంగా వున్నాయి. నందనవనం, పారిజాతపరిమళంకల్పించే మత్తుచూస్తే ఓసారి అలా నందనవనం వెళ్ళివద్దామా షికారుగానైనా అనిపించకమానదు. అంతదూరం ఈ బొందితో పోలేంకనుక, శ్రీకృష్ణతులాభారంచూచి శ్రీ రామానాయుడు సృష్టిని అనుభవిస్తే తీరుతుంది.

— —

టీచర్లు కావాలి

'రూరల్ వెల్‌ఫేర్ అసోసియేషన్' తడవారిచే నిర్వహింపబడు 8 తరగతి కండెన్సుడుకోర్సు విద్యార్థినులకు, బోధించుటకుగా టీచర్లు కావలెను. 8 తరగతికి బోధించు అనుభవముండి రిటైరయిన ఉపాధ్యాయులు, 8 తరగతికి బోధించు అనుభవముగల ఉపాధ్యాయినులు, దరఖాస్తులు ఆగస్టు నెలాఖరులోగా పంపుకొనవలయును. గవర్నమెంటు నిబంధనల ప్రకారము జీతములు యివ్వబడును.

—ఈ. వేణుగోపాలరెడ్డి, ఛేర్మన్,
రూరల్ వెల్‌ఫేర్ అసోసియేషన్, తడ.

కందుకూరు మునసబు మేజస్ట్రేటు కోర్టులో

E. P. 42 of 66 Sc 268 of 65

యిన్నమూరు పురుషోత్తం —వాది.
మేకనబోయిన చినరోశయ్య —ప్రతివాది.

ప్రతివాది తా॥ యీ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పైకోర్టులో 24-10-66 తేదీన వేలం జరుగును. పాటదారులు పాటలు పెట్టుకోవచ్చును.

షెడ్యూలు: కందుకూరు తా॥ బోగసంపాడు మజరా చెరుకుంపాలెం గ్రామంలో 3-వ వార్డు 7 వ నెంబరుగల యింటికి, కాళీస్థలంకు హద్దులు: [తూ] బజారు [ద] సుబ్బమంచి వోబయ్య యిల్లు [ప] వుండేల బయ్యపురెడ్డి యిల్లు [ఉ] పిల్ల కోటిరెడ్డి యిల్లు పై హద్దులలోని కాళీస్థలము 6 గదులు యీ స్థలంలోవుండే పంటిదూలాపు పూరియిల్లు 1, యింటి పైకప్పు, అడుగుస్థలం యింటికి నాలుగు ప్రక్కల కాళీస్థలమున్నూ వాది వాల్యూయేషన్ రూ. 150/- అమీనా వాల్యుయేషన్ రూ. 175/- లు. Price fixed Rs. 300.

—యస్. సత్యనారాయణ, అడ్వకేటు

నెల్లూరుజిల్లా అఫిషియల్ రిశీవరు కోర్టులో

నెల్లూరు సబ్‌కోర్టు ఐ. పి. నెం. 10/60 రు ఏలూరు పోలయ్య - తండ్రి నారయ్య కనుపర్తిపాడు - నెల్లూరు తా॥-ఇన్‌సాల్వెంటు.

పై నెంబరు యిన్‌సాల్వెంటువల్ల రావలసిన బాకీలకు ఆయా బాకీదారులు తమ బాకీ రుజువుపత్రములను యీ ఆఫీసులో 3-9-66 తేదిన పగలు 2 గంటలలోగా దాఖలు చేసుకొనవలయును. అట్లు బాకీలను రుజువు పరచుకొనని బాకీదారులకు దామాషా పంచివ్వబడదు.

— బి. విశ్వనాథం,
అఫిషియల్ రిశీవరు - నెల్లూరు.

నంద్యాల డి॥ ము॥ కోర్టులో

O. S. No. 111 of 1966

మాడా నర్శిరెడ్డి — వాది.
బోయ రామన్న —ప్రతివాది.

వాది ప్రతివాదికియ్యవలసిన ప్రోనోటు బాకీకిగాను రూ. 870 లకు పై దావా దాఖలు చేసినందున 12-9-66 తేదిన వాయిదా వున్నది. ప్రతివాదికి ఆక్షేపణ లున్న పైకోర్టువారి యెదుట వాయిదారోజు పగలు 10 గంటలకు హాజరయి తెలుపుకొనవలయును.

—యం. సుబ్బారెడ్డి,
వాది అడ్వకేటు.

కావలి సబార్డినేట్ జడ్జి కోర్టులో

E. P. No. 93 of 1965. N. O. S. No. 65 of 1964.

గునుపాటి చంద్రారెడ్డి .... — వాది.
(1) వేలూరు సంజీవయ్యనాయుడువగైరాలు —ప్రతివాదులు.

1-టో ప్రతివాది తాలూకు యీ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టువారి యెదుట 22-9-66 తేదిన బహిరంగముగా యాలము వేయబోవుచున్నారు. గనుక పాటదార్లు హాజరై పాటలు పెట్టుకొనవచ్చును.

—: షెడ్యూలు : -

కోవూరు తాలూకా, వెంకనపురం గ్రామములో 1-టో ప్రతివాదికి హక్కు స్వాధీనానుభవముగల:-

(1) మాగాణి సర్వే నెం. 1 రు, య 4-63 సెంట్లు వాది క్రయం రూ. 8000/- లు, అమీనా క్రయం రూ. 27,780/- లు.

(2) కోవూరు తాలూకా, గుండాలమ్మపాలెంలో 1-టో ప్రతివాదికి హక్కు స్వాధీనానుభవంగల మాగాణి సర్వే నెం. 109/A రు, య 1-41 సెంట్లు వాదిక్రయం రూ. 2000/- లు, అమీనాక్రయం రూ. 8460/- లు.

(3) డిటో గ్రామంలో మాగాణి సర్వే నెం. 111 రు, య 1-15 సెంట్లు వాది క్రయం రూ. 2000/- లు, అమీనా క్రయం రూ. 6900/-

(4) డిటో గ్రామంలో మాగాణి సర్వే నెం. 110 రు, య 0-86 సెంట్లులో య 0-75 ట్లకు హద్దులు:- [తూ – ద –] 1-టో ప్రతివాదికి నె. 2, 3 రు ఐటములు భూములు [ప] సిద్దారెడ్డి క్రిష్ణమ్మ భూమి. యీ హద్దులలోని య 0-75 సెంట్లు వాది క్రయం రూ. 1000/- లు. అమీనా క్రయం రూ. 4500/- లు.

—కేతిరెడ్డి కోదండరామరెడ్డి - వాదిఅడ్వకేటు.